

## పూలే విగ్రహానికి నివాళ్లర్పించిన సీఎం రేవంత్ రెడ్డి...

**- పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు, నగర మేయర్, అధికారులు**

**హైదరాబాద్,11(పిసిడబ్ల్యూ న్యూస్):**మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ అంబర్‌పేటలోని విగ్రహానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో కలిసి మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు సంబంధించి నెక్లెస్ రోడ్డు మార్గం, ఐమాక్స్ సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి విగ్రహ ఏర్పాటుకు అవసమైన ప్రణాళికను అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు సలహాదారు వేం.నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, పలువురు ప్రజా ప్రతినిధులు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

## 2వేల కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన సమస్యలను ఆరు నెలల్లో ఆన్‌లైన్‌లోనే పరిష్కరించాలని నిర్ణయించాం. నగరంలో చేపట్టిన జీఐఎస్ సర్వే ద్వారా 9 లక్షల ఆస్తుల సర్వే పూర్తయింది. దాని వల్ల ఆస్తి పన్ను వసూళ్లు మరింత పెరగొచ్చన్నారు.

## టెట్ షెడ్యూల్ విడుదల

**- జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు**

**హైదరాబాద్,11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## గోదావరి-బనకచర్లపై ముందుకెళ్లకుండా చూడండి

**- గోదావరి బోర్డుకు తెలంగాణ ఇఎన్సీ లేఖ**

**హైదరాబాద్,11(పిసిడబ్ల్యూ న్యూస్):** గోదావరి–బనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయం లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతలపై ఎలాంటి టెండర్లు చేపట్టకుండా చూడాలని కోరింది. 7న జరిగిన సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించామని పేర్కొంది.. గోదావరి –బనకచర్ల ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారు. మరుసటి రోజే ఏపీ జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఆలస్యం చేయకుండా తక్షణమే ఏపీని నిలువరించాలని లేఖలో పేర్కొంది.

## ఈడీకి ప్రాథమిక హక్కులుంటే.. ప్రజలకూ ఉంటాయ్

**- కేంద్ర దర్యాప్తు సంస్థకు సుప్రీంకోర్టు చురకలు**

**న్యూఢిల్లీ: 11(పిసిడబ్ల్యూ న్యూస్):**తనకు ప్రాథమిక హక్కులు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) భావించిన పక్షంలో ప్రజలకు కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయని ఈడీ గ్రహించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపూర్తి నిగం(ఎన్ఏఎన్) స్కామ్ కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి న్యూఢిల్లీకి బదిలీ చేయాలని కోరుతూ ఈడీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పౌరుల కోసం ఉద్దేశించిన రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్‌ను ఈడీ ఎలా దాఖలు చేసిందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ప్రశ్నించింది.



## మూసీ పనులను వేగవంతం చేయాలి...

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలన్నారు. సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఉండే విధంగా డిజైన్లను ఎంచుకోవాలన్నారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్లు ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలన్నారు. సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే'ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలన్నారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్‌తో కూడిన డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలన్నారు. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. మీర్ అలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు రూపొందించాలన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించి ఆ మేరకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. మీర్ ఆలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలన్నారు. ఇక్కడి అభివృద్ధి ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్‌గ్రేడ్ చేయాలన్నారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలన్నారు. అభివృద్ధి ప్రతిపాదనలన్నీ పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం.నరేందర్ రెడ్డి, శ్రీనివాస రాజు, మున్సిపల్ శాఖ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. ఇదిలావుంటే వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ వారణాసిలో పర్యటించిన సందర్భంగా ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

## భావితరాలకు స్ఫూర్తి ప్రధాత మహాత్మా జ్యోతిభా ఫూలే

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ చౌక్ లో మహాత్మా జ్యోతిభా ఫూలే చిత్రపటానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనాడు సామాజిక న్యాయం కోసం బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిరావు పూలే చూపించిన మార్గదర్శకత్వంలో వారిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. అహ్మదాబాద్ ప్లీనరీలో రాహుల్ గాంధీ దేశానికి తెలంగాణ దిక్సూచిగా ఉందన్నారు. కుల గణన చేసి బీసీలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సహచర మంత్రులు కలిసి ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లు పెంచడం జరిగిందన్నారు. సిరిసిల్లలో జ్యోతిరావు పూలే విగ్రహం లేకపోవడం బాధాకరం అన్నారు. వచ్చే పూలే జయంతి లోపు పూలే కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకోవాలన్నారు. వచ్చే ఏప్రిల్ 11 2026 నాడు విగ్రహానికి దండ వేసుకునే విధంగా ఉండాలన్నారు. రాహుల్ గాంధీ చరిత్రలో నిలిచిపోయే విధంగా జిత్నే ఆబాది ఉత్నె ఇసెదరీ అని అందరికీ న్యాయం జరగాలని వారి ఆదర్శం రాబోయే కాలంలో తెలంగాణలో సామాజిక విప్లవం సృష్టిస్తాం అన్నారు.

## పేదలకు మూడు రంగుల కార్డులు

(మొదటి పేజీ తరువాయి)



ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కార్డుల ముద్రణ కోసం టెండర్లు పిలిచామని, త్వరలోనే కొత్త కార్డులు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్న బియ్యం ఇవ్వడం దేశ చరిత్రలోనే గొప్ప కార్యక్రమమని అన్నారు. చేశారు. కేంద్రం మనిషికి 5 కిలోల దొడ్డు బియ్యం ఇస్తుండగా.. తాము 6 కిలోల సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం ఇవ్వడానికి రూ.10,600 కోట్లు ఖర్చుకాగా.. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం కోసం రూ.13 వేల కోట్లను వెచ్చించనున్నామని ప్రకటించారు. గురువారం జల సౌధ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్కెట్‌లో రూ.40కి కిలో సన్న బియ్యం కొనుగోలు చేసి, పేదలకు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన బియ్యం 80–90 శాతం దాకా పక్కదారి పట్టిందని.. ప్రస్తుతం ఇస్తున్న బియ్యం వంద శాతం సద్వినియోగం అవుతుందని చెప్పారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇక ఏ రాష్ట్రంలో పండనంత వరి ప్రస్తుతం రాష్ట్రంలో పండుతోందని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో, ఉమ్మడి ఏపీలో కూడా ఈ స్థాయిలో ఉత్పత్తి రాలేదని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వడ్ల సేకరణ కోసం 8,209 కేంద్రాలు పెట్టాలని నిర్ణయం తీసుకున్నామని, ఇప్పటిదాకా 2,573 కేంద్రాలు తెరిచామని వెల్లడించారు. ధాన్యంలో తేమ 17 శాతం పైన ఉంటే కొనుగోలు చేయబోమని చెప్పారు. రాష్ట్రంలో ఈ ఏడాది సన్నబియ్యం పంపిణీ కోసం 30 లక్షల టన్నుల ధాన్యం సిద్ధంగా ఉంచామని ఉత్తమ్ ప్రకటించారు. తెలంగాణ ఏర్పడే నాటికి 90 లక్షల మందికి తెల్లకార్డులు ఉండగా.. పదేళ్లలో కొన్ని రద్దు కాగా.. కొత్తగా ఇచ్చింది 49 వేల కార్డులేనని చెప్పారు. ప్రస్తుతం 2.81 కోట్ల మందికి సన్నం బియ్యం అందుతుండగా.. కొత్తగా రేషన్‌కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తయితే ఆ సంఖ్య 3.10 కోట్ల మందికి చేరే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వనందున హైదరాబాద్‌లో సన్న బియ్యం ఇవ్వడం లేదని, ఎన్నికలు పూర్తికాగానే ఇస్తామని తెలిపారు. **వాలంతరికి పూర్వ వైభవం తెస్తా: ఉత్తమ్...** వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(వాలంతరి)కి పూర్వ వైభవం తీసుకువస్తానని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని వాలంతరిని గురువారం ఆయన సందర్శించారు. ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారులు(జేటీవో), 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈ)కు నియామక పత్రాలు అందించే కార్యక్రమం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఉత్తమ్ ఏర్పాట్లను పరిశీలించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు

(మొదటి పేజీ తరువాయి)

వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారధ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు. ఆ ఎంపీకి రేవంత్ అనుచిత లబ్ధి చేకూరుస్తున్నారు. త్వరలోనే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెబుతానన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రం, ఆర్బీఐ, సీబీఐ, సెబీ, ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేయాలని కోరుతున్నాం. 400 ఎకరాలకు టీ–జీఐఐసీకి యజమాని కాదు. తమది కాని భూమిని టీ–జీఐఐసీ తాకట్టు– పెట్టింది. మోసపూరిత భూమిని తాకట్టు పెట్టుకుని బ్యాంకు రుణం ఇచ్చింది. 400 ఎకరాల భూమి విలువ రూ.5,239 కోట్లు– అని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ చెబుతున్నది. అదే భూమి విలువ రూ.30 వేల కోట్లు– అని రెవెన్యూ శాఖ చెప్పింది. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. తమది కాని భూమిని టీ–జీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుందని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటేనే సీవీసీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. లిటిగేషన్ భూమికి ఐసీఐసీఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణ తెచ్చుకుందే ఉగ్యోగాల కోసం...

- వరంగల్‌లో మెగా జాబ్ మేళా ప్రారంభించిన మంత్రులు
- త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్
- వెల్లడించిన మంత్రి సీతక్క



**వరంగల్,11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. 60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సాధించారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై పదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 60వేల ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కష్టం.. అందుకే ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం దక్కుతుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# శుక్రవారం సభ, పోషణపక్షం





**గంగాధర, ఏప్రిల్ 11 (పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో మల్లాపూర్ గ్రామంలో , నడింపల్లి అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం సభ మరియు పోషణ పక్షంలో భాగంగా అన్న ప్రసన్న కార్యక్రమం చేయడం జరిగింది. వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి గర్భిణులకు బాలింతలకు వివరించడం జరిగింది కార్యక్రమంలో సిడిపిఓ నర్సింగరాణి ,సూపర్వైజర్ రేణుక ,పోషణ బీసీ శ్రీధర్ ,స్పెషల్ ఆఫీసర్ శివ నాగేందర్ రెడ్డి ,గ్రామపంచాయతీ సెక్రెటరీ సాయికుమార్ ,అంగన్వాడి టీచర్స్ కవిత,రమణ ఆయా శైలజ,ఆశా శారద గర్భిణులు బాలింతలు ఫ్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

# పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబలి వితరణ కార్యక్రమం




**గంగాధర, ఏప్రిల్ 11 (పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య యువజన సంఘంఆధ్వర్యంలో అబలి వితరణ కార్యక్రమం లో జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు శ్రీ కన్న కృష్ణ , జిల్లా మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు రావికాంటి భాగ్యలక్ష్మి, జిల్లా యువజన అధ్యక్షులు జీడిగే సాయి కృష్ణతో కలిసి పాల్గొని అంబలి వితరణ చేయడం జరిగింది.వేసవి కాలంలో మంచి కార్యక్రమం చేపట్టిన పట్టణ యువజన సంఘం అధ్యక్షుడు తణుకు సాయికృష్ణ , వారి కార్యావర్గాన్ని అభినందిచడం జరిగింది.నగునూరి రాజేందర్ అధ్యక్షుడుపట్టణ ఆర్య వైశ్య సంఘంకరీంనగర్ పాల్గొన్నారు.

# శుభ కార్యాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు...

**మానకొండూర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం జరిగిన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. తొలుత రేకుర్తి లోని రాజశ్రీ గార్డెన్స్ లో జరిగిన తిమ్మాపూర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు,కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు కుమారుడు, సీనియర్ జర్నలిస్ట్ ప్రకాశ్ రావు కుమార్తె పెళ్లి నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, అన్నమనేని నర్సింగరావు, ఎస్. కొండల్ రావు, మామిడి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామంలో జరిగిన పార్నంది నరసయ్య కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ వేడుకకు మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందరిగి రవీంద్రచారి,పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, కనకం అశోక్ తదితరులు హాజరయ్యారు.



# పాలిటెక్నిక్ కళాశాల నూతన భవానికి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**హనుమకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవానికి పూజ చేసే కార్యక్రమంలో స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. తొలుత విద్యార్థి విద్యార్థినులు ఎంపీ, ఎమ్మెల్యేలను పుష్పగుచ్ఛం అందజేసిన స్వాగతం పలికారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయం ఎంపీ, ఎమ్మెల్యేలను, కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే నాగరాజు కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కలెక్టర్ శ్రీమతి పి.ప్రావీణ్య, అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థుల సంఘం, విద్యార్థి విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సామాజిక సమానత్వం సాధ్యం

- హన్మకొండలో బీసీల కోసం పూలే భవనం ఏర్పాటు చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్



**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యతోనే బడుగు, బలహీన జీవితాల్లో సుస్థిరమైన మార్పులు సాధ్యమవుతాయన్న ఆశయంతో పోరాడిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా మనమంతా కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. శుక్రవారం జ్యోతిబా పూలే 199వ జయంతి సందర్భంగా ఆయన హన్మకొండలోని ములుగు రోడ్డు వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒకనాటి కుల, వర్ణ వ్యవస్థల వల్ల దళితులు, బడుగు, బలహీన వర్గాలు తీవ్ర వివక్షతకు గురయ్యారని, అలాంటి సమాజంలో 1827లోనే బడుగు బలహీన వర్గాల, మహిళల అభ్యున్నతికి పూలే చేసిన కృషి అపూర్వమన్నారు. ఆయన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి బాలికల విద్య కోసం వారు చేసిన కృషి అందరికీ ఆదర్శనీయమన్నారు. జ్యోతిబా పూలే జయంతి రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని, హన్మకొండ నగరంలో బీసీల కోసం పూలే భవనం ఏర్పాటు చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మరియు జిల్లా నాయకులు డా.చిర్ర రాజు, బోనగాని యాదగిరి గౌడ్, తంగళ్ళపల్లి రమేష్, అరేగంటి నాగరాజు, వల్లల జగన్, జనగాం శ్రీనివాస్, ఏరుకొండ రమేష్ పాల్గొన్నారు.

# మనువాదంపై పోరాడడమే పూలేకు అర్పించే నిజమైన నివాళి

- ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్స్ సాధన కోసం ఉద్యమం
- ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో పూలే జయంతి



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఏప్రిల్ 11,(పిసిడబ్ల్యూ న్యూస్):**వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలోఈ రోజు జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా సైనిక్ పూరీలోని మెయిన్ రోడ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ పి ఆర్ డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కుల జాడ్యం మన దేశంలోనే ఉన్నదని, వేల సంవత్సరాలు గా కులం పేరుతో ఆధిపత్యం చేస్తూ సామాజిక, ఆర్థిక దోపిడీ కొనసాగిన దానికి వ్యతిరేకంగా తమ జీవితాంతం పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారులని పూలే దంపతులను కొనియాడారు. నేడు దేశన్ని పాలిస్తున్న ఆర్ఎస్ఎస్ నెత్రుత్వంలోని , బీజేపీ పచ్చి మతోన్మాద అవకాశవాద రాజకీయాలను నడుపుతూ దేశంలోని ప్రజలను రెచ్చగొడుతూన్నారని అన్నారు. పాతకాలపు నీచమైన రాచరిక వ్యవస్థలోకి తీసుకెళ్ళే దుష్ట ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగన్ని మార్చి మానుధర్మ శాస్త్రన్ని అమలు చేయాలని బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేసి రిజర్వేషన్స్ లేకుండా చేస్తున్నారని విమర్శించారు.ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాడాలని అన్నారు. పూలే స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె చంద్రమోహన్, సుల్తాన్ రమేష్ బాబు, మేడ్చల్ జిల్లా నాయకులు రమేష్, శివ తదితరులు పాల్గొని జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జ్యోతి బాపూలే జయంతి వేడుకలు



**చిట్యాల, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటిసారిగా ఆడవాళ్లకు పురుషులతో పాటుగా సమాన అవకాశాలు ఉండాలని స్త్రీలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని మహారాష్ట్ర పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించి స్త్రీల అభివృద్ధికి పాటుపడిన సామాజిక సంఘ సేవకుడు జ్యోతిరావు పూలే అని తెలియజేశారు అందుకే మనదేశంలో వారి పేరు మీద ఎం జె పి పాఠశాల ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11వ తేదీని జ్యోతిరావు పూలే జయంతిని జరుపుకుంటున్నారని అన్నారు ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యార్థుల ఉజ్వల భవితకు పాలిటెక్నిక్ కళాశాల బాటలు వేస్తుంది

- ఘన స్వాగతం పలికిన విద్యార్థులు
- రూ.28 కోట్లతో నిర్మించే నూతన పాలిటెక్నిక్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యార్థుల ఉజ్వల భవితకు, భావితరాలకు పాలిటెక్నిక్ కళాశాల బాటలు వేస్తున్నదని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండలోని పాలిటెక్నిక్ కళాశాలలో రూ. 28 కోట్లతో నూతనంగా నిర్మించనున్న భవనానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తో కలసి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య భూమి పూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. విద్యకు రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రాష్ట్రంలోని నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 11 వేల కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రంలోని 55 నియోజక వర్గాలలో మొదటి విడతన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తుందని ఎంపీ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వరంగల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఎంపీ తెలిపారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన వరంగల్ లో ఇప్పటికే మమునూరు ఎయిర్పోర్ట్ తో పాటు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, నగర అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల సమిష్టిగా కృషి చేస్తున్నామని తెలియజేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన పూర్వపు విద్యార్థులను ఎంపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ , కూడా చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఈ.వి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రజల జీవితాల్లో వెలుగులు



**హనుమకొండ, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారని వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండలోని బాలసముద్రంలో గల బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కేసిఆర్ కృషి చేశారని, బీఆర్ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పండుగలా వేడుకలను నిర్వహించుకుందామని,ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజితోత్సవం సభకు కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజలు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.**చారిత్రాత్మక సభగా జరుపుకుందాం: సిరికొండ..** ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభను చారిత్రాత్మక సభగా జరుపుకోవాల్సిన అవసరం ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ సాధన క్రమంలో వరంగల్, కరీంనగర్ జిల్లాలు పోషించిన పాత్ర మాటల్లో చెప్పేది కాదని, కలిసికట్టుగా సభను విజయవంతం చేద్దామన్నారు.**ప్రజలు, పార్టీ శ్రేణుల్లో విశేష స్పందన:ఎమ్మెల్సీ...** బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు, పార్టీ శ్రేణుల్లో విశేష స్పందన లభిస్తుందని ఎమ్మెల్సీ తక్కెల్లపల్లి రవీందర్ రావు అన్నారు.సభకు పెద్ద ఎత్తున తరలివస్తామని ప్రజలు చెప్తున్నారని, లక్షలాది మందితో సభజరుగుతుందని, ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు, మజ్జిగ, ఇతర అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు పెద్ది సుదర్శన్ రెడ్డి, తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, వొడితల సతీష్ బాబు, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, వాసుదేవ రెడ్డి, నాయకులు సాంబారి సమ్మారావ్, సదానందం, యాదగిరి, జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, ఎల్లావుల లలితా యాదవ్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పార్టీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం...** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశాన్ని నేడు (శనివారం) బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం లో నిర్వహించనున్నామని, ఈ సమావేశానికి మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ అనుబంధ సంఘాల సభ్యులు, బీఆర్ఎస్వీ ప్రతినిధులు, పార్టీ బూత్ కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నేతలు కోరారు.

# బిఆర్ఎస్ నాయకులు పరామర్శ

**గంగాధర, ఏప్రిల్ 11(పీసిడబ్ల్యూ న్యూస్):** ధర్మపురి నమస్తే తెలంగాణ రిపోర్టర్ చిలుముల రాజేందర్, బిఆర్ఎస్ నాయకులు చిలుముల మహేందర్ గార్ల తల్లి లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా వారి స్వగ్రామమైన రామడుగు మండలం రుద్రారం గ్రామంలో కుటుంబ సభ్యులను ఈ రోజు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించి మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఇక్కడ పెగడపల్లి సింగిల్ విండో ఛైర్మెన్ ఓరుగంటి రమణారావు, రామడుగు మండల అధ్యక్షులు గంట్ల జితేందర్ రెడ్డి, నాయకులు గుర్రం రాజశేఖర్ , తన్నీరు బాబు, నర్సయ్య, పరమేష్,నరేష్ నాయకులు ఉన్నారు.



# అణగారిన వర్గాల అభ్యున్నతికి కోసం ఎనలేని కృషిచేసిన మహనీయుడు జ్యోతిరావు పులే

**● వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు**

**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి మహిళల విద్యకు బాటలు వేసిన ఆ మహనీయుడి మహ్మాత జ్యోతి రావు పూలే అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం 199వ జయంతి శుక్రవారం ములుగు రోడ్డు జంక్షన్ లోని జ్యోతి పూలే విగ్రహానికి అటవీ, పర్యావరణ, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి పూలమాల వారి వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి పూలే అని, సావిత్రిబాయి పులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులని, సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించేవారని, వితంతు పునర్వివాహాల గురించి పూలే ప్రజల్లో చెట్కతన్యం తీసుకువచ్చి స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించాడు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" స్థాపించి, వితంతువులెట్కన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు. దేశంలోనే ఇటువంటి కేంద్రం స్థాపించడం ఇదే మొదటిసారి. సత్యశోధక సమాజం తరపున ప్రారంభించిన 'దీనబంధు' వారపత్రికలో రెట్కతులు, కార్మికుల సమస్యలు, బాధలు వివరించేవారు. భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికుడు పూలే. దుర్మార్గమైన కులవ్యవస్థ సమూలంగా నిర్మూలన కావాలని కోరుకున్న మొదటి వ్యక్తి పూలే



సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. సమాజంలో వెనుకబడినవర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతికోసం చేసిన కృషికి ఆయనకు 'మహాత్మ' బిరుదు ఇచ్చారు. నిరంతరం సమసమాజ స్థాపన కోసం పరితపించిన వ్యక్తి మహాత్మ జ్యోతి రావు పూలే... సమన్యాయ సత్యశోధకుడు భారతదేశంలోని దళిత బహుజన, ఆదివాసీ గిరిజన, ముస్లిం మైనార్టీలు కుల వ్యవస్థలో బానిసలుగా ఉన్నారనీ, వీరు అమెరికాలోని నల్లజాతి బానిసల్లాగా ఉన్నారని చెప్పిన మొట్టమొదటి వ్యక్తి పూలే. కుల వ్యవస్థలోని బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడడమొక్కటే మన ముందున్న ప్రథమ కర్తవ్యంగా పూలే ప్రకటించారు. బడుగులు బానిసలుగా ఉండడానికి దోపిడీ, అణచివేత, వివక్షలను అర్థం చేసుకోకపోవడం, అందుకు చదువు లేకపోవడమే మూలమని పూలే గ్రహించాడు. మొట్టమొదటగా దళిత బాలికలకు పాఠశాల నెలకొల్పారు. ఆ తదనంతరం 1851లో మరో రెండు పాఠశాలల్ని నెలకొల్పారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని



స్థాపించారు.పూలే కేవలం శూద్ర వర్ణాల్లో అణిచివేతకు గురౌతున్న కులాల ప్రజల పక్షాన పోరాడటమే కాకుండా, అగ్రవర్ణ వితంతువుల పునర్వివాహానికి గొప్ప కృషి చేశారు. బ్రిటిష్ వలస వాదులకు '1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. పూలే కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉండేవి అన్నారు. సత్యశోధక సమాజాన్ని విస్తరింపజేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు.ఈ కార్యక్రమంల కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, వరంగల్ , హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యా శారద దేవి, ప్రావిణ్య మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజి, అదనపు కలెక్టర్లు. అధికారులు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, మండల, గ్రామ, డివిజన్ స్థాయి నాయకులు కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, బీసీ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ప్రజలు నీరాజనం...






**కరీంనగర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.ఉస్మాన్ పుర చౌరస్తా నుండి పాదయాత్ర ప్రారంభమై 33,34,35,36,52,53,54 డివిజన్ల మీదుగా కలెక్టరేట్ రోడ్ వరకు కొనసాగింది.ఈ పాదయాత్రను ఉద్దేశించి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ కి వంద సంవత్సరాల క్రితం మహాత్మా గాంధీ అధ్యక్షుడిగా ఉండి స్వాతంత్ర్య పోరాటం చేసిన సంగతి ఈ తరానికి తెలుపాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మరియు భారత రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర కొనసాగుతుందని నరేందర్ రెడ్డి తెలిపారు.ఈ పాదయాత్ర లో కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెల్చాలా రాజేందర్ రావు, నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్,ఎం డి తాజుద్దీన్, శ్రవణ్ నాయక్,తాజా మాజీ కార్పొరేటర్ పిట్టల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, సారిలా ప్రసాద్, నేహాల్,ఆహేమద్, పొన్నం శ్రీనివాస్, అజ్మత్, కృష్ణా, ఖలీల్, వాడే వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి పై కేసు నమోదు: ఎస్ఐ తిరుపతి

**బయ్యారం, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం మండల కేంద్రానికి చెందిన వివాహిత పై గురువారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో మండల కేంద్రానికి చెందిన కొండూరు కార్తీక్ అనే వ్యక్తి వివాహిత ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి నేను మీ ఇంటికి వస్తున్నాను,మీ ఇంటి వెనకాల తలుపులు తెరిచి ఉంచమనీ చెప్పడంతో వివాహిత నమ్మి తలుపులు తీయగా కొండూరి కార్తీక్ అనే వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించి తనను మానభంగం చేయడానికి ప్రయత్నించాడని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్ఐ కే.తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భారత దేశంలో సాంకేతిక విద్యాభివృద్ధికి పునాదులు వేసింది భారతీయ జాతీయ కాంగ్రెస్

**● రూ. 28 కోట్ల నిధులతో పాలిటెక్నిక్ నూతన భవనానికి భూమి పూజ నిర్వహించిన వరంగల్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**భారత దేశంలో సాంకేతిక విద్యాభివృద్ధికి పునాదులు వేసింది భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్టీ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరం లో నూతన పాలిటెక్నిక్ భవనానికి రూ. 28 కోట్లు నిధులు మంజూరి చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎం.పి. కడియం కావ్య, వర్ధన్నపేట ఎం.ఎల్.ఏ. కే.ఆర్. నాగరాజు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్ తో కలిసి శుక్రవారం భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ హయంలో 1955 వ సంవత్సరంలో వరంగల్ పట్టణ నడిబోడ్డులో ఏర్పాటు చేయబడిన సాంకేతిక విద్యాలయం వరంగల్ పాలిటెక్నిక్ కాలేజి. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సాంకేతిక విద్యా శాఖా మంత్రిగా ఉన్న జిల్లాకు చెందినా హయగ్రీవ చారి కూడా ఈ కళాశాలను ఎంతో అభివృద్ధి చేసారు. జూనియర్ టెక్నికల్ ల్స్కోల్ (జేటిఏం) స్థాయి నుండి డిప్లొమా పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ విద్యనూ అందించే స్థాయికి ఎదిగిన వరంగల్ పాలిటెక్నిక్ లో విద్యనూ అభ్యసించిన వారు అంతర్జాతీయంగా, దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ఉన్నత స్థానాలలో స్థిరపడి ఉన్నారు.నేటికి 70 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2014 తెలంగాణా ఆవిర్భావం నాటికి అత్యంత శిథిలావస్థకు చేరుకొని ప్రమాదః భరితంగా మారింది. ఆ సందర్భంలో ఆ నాటి విద్యార్థి నాయకులు, విద్యార్థులు సంభందిత సాంకేతిక విద్యాశాఖా ఉన్నతాదికారుల దృష్టికి , వరంగల్ జిల్లా యంత్రాంగం దృష్టికి, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు సమస్యను తెలియ చేసిన ఏం



పట్టించుకోలేదు. ఆనాటి విద్యార్థి నాయకుడు మేకల అక్షయ్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులు అనేక మార్లు ధర్నాలు నిరాహార దీక్షలు, తరగతుల బహిష్కరన చేసిన కూడా ఆనాటి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం పట్టించుకోలేదు, నిధులు మంజూరు చేయలేదని,నేను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక కళాశాల పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్ మా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులూ ఈ..వి. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు వచ్చి కలవడంతో పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనానికి నిధులు కావాలని లేఖ రాయడం జరిగింది.గత దశాబ్ద కాలంగా పరిష్కారం కాకుండా ఉన్న ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 28 కోట్ల నిధులను పాలిటెక్నిక్ భవనానికి విడుదల చేశారన్నారు. అతి త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి కళాశాల నూతన భావన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి భవిష్యత్ తరాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ కానుకగా అందిస్తామని అన్నారు.వరంగల్ పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ కళాశాల అతిత్వరలోనే రాబోవు విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ ఇంజనీరింగ కళాశాల స్థాయికి ఎదిగేలా తీర్చి దిద్దుతామని ఎం.ఎల్.ఏ. గా మీకు హామీ ఇస్తున్నానని అన్నారు. అదే విధంగా వరంగల్ ఎం.పి. కడియం కావ్య మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాతా దశాబ కాలం పాటు పాలించిన గత ప్రభుత్వ హయంలో సాంకేతిక విద్యా శాఖా పరిధిలో వరంగల్ ప్రభుత్వ మహిళా వృత్తి విద్యా కళాశాలను మూసివేయడం జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ ఇంజనీరింగ్ విద్యనూ అందించడమే కాకుండా ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ ద్వారా, స్వయం ఉపాధి పథకాల ద్వారా వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఎల్లా వేళల కృషి చేస్తోందని







అన్నారు. అదేవిధంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ..గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని పేడ చెవిన పెట్టిందని, వారు కేవలం తమ అభివృద్ధి ని మెరుగు పరచుకోవడం తప్ప నగర అభివృద్ధి కోసం చేసింది శూన్యమని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అభివృద్ధి లభిస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివ్రుద్ధి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్, డాక్టర్ రామ్ ప్రసాద్, కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు %ు% కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ.వి. శ్రీనివాస్ రావు, మేకల అక్షయ్ కుమార్, శ్రీ విద్య, కుమ్మరి వేణు. బానోత్ వెంకన్న, రవితేజ, కుమార్, దయాకర్, శ్రీలేఖ, కళాశాల గత ప్రిన్సిపాల్ రామనారాయణ, వెంకట నారాయణ, బోధనా సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులూ వేముల శ్రీనివాస్ బంక సరళ, రహీమున్నిసా బేగం, అంబేద్కర్ రాజు తాళ్ళపల్లి మేరి,, నాయకులు పాల్గొన్నారు.

## ఇండియా ఉపఖండానికి" పూలే పవర్ ఫుల్ మెన్"

**మోర్తాడ్, ఏప్రిల్ 11 (పీసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఆధునిక భారతంలో జ్యోతిరావు పూలే పవర్ ఫుల్ మహామానవుడు. దేశం పట్ల ఆయన చేసిన అద్భుతమైన కార్యాల వల్ల ఆయనకు "మహాత్మా" అనే బిరుదు ముంబై ఓ/బీసీ ప్రజలు బహుకరించారు. తండ్రి రైతు. జ్యోతిరావు కూడా వ్యవసాయం చేశారు. ఆయన రైతుల దోపిడి నిర్మూలన పట్ల పుస్తకం రాశారు. పలు కవితలు నాటికలు వ్యాసాలు గ్రంథాలు రాసిన గొప్ప సాహిత్యవేత్త. పువ్వుల తోట, కూరగాయల పంట, పండ్లు పండించి పూణే నుంచి ముంబై సిటీకి విక్రయం చేసేవారు పూలే దంపతులు. అనంతరం 7ఏండ్ల పాటుగా పూణే సిటీకి కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించి 2సిటీలలో అనేక భవనాలు, రోడ్లు, వంతెనలు నిర్మించిన గొప్ప కాంట్రాక్టర్ గా, పూణే సిటీ నిర్మాతగా బ్రిటిష్ వారి నుంచి పూలే గారు మన్ననలు పొందిన ఘనత ఉంది. సావిత్రిమాయి ఫాతిమాషేక్ లతో కల్సి 4జిల్లాలో 18 పాఠశాలలు స్థాపించి "ఎద్యుకేషన్ ఫ్రం బిలో" అనే విద్యా విధానం ఉండాలంటూ "హంటర్ కమిషన్" కు నివేదికిచ్చిన గొప్ప విద్యావేత్త. పూలే తన సత్యశోధక్ సంస్థ ద్వారా మనువాదానికి విరుద్ధంగా మైనార్టీ ఓ/బీసీ ఎస్సీ ఎస్టీలకు చెందిన 316 కులాల ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నింపిన సమాసమాజ ఉద్యమనేత. వీరిని అంబేద్కర్ తన గురువుగా స్వీకరించడంలో మహామేధాసుకు ప్రతీకగా మనం చూడాలంటూ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అంగుళి మాలజీ ఎలుగెత్తి చాటారు. శుక్రవారం దళిత సంక్షేమ సంఘంచే జిల్లా నిజామాబాద్ మోర్తాడ్ మండల కేంద్రంలో పూలే విగ్రహం వద్ద జయంతిని జరిపారు. ఇందులో డిఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి జాంబవ చమార్, మామిడి రవి, ఎం.గంగాధర్, బండి సాగర్, సదానాథ్, నర్సారెడ్డి ముదిరాజ్ పాల్గొన్నారు. విప్లవయోద్ధ పూలేకు జోహర్ల నినాదాలతో మండలం మారుమోగింది.



# ఆన్లైన్ స్లాట్ బుకింగ్స్ విధానం రద్దు చేయాలని డిమాండ్

**● ధరణి వ్యవస్థలో ఇప్పటికీ పరిష్కారం లేదు**

**గంగాధర, ఏప్రిల్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గంగాధరలో డాక్యుమెంట్ రైటర్ల నిరసన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఆన్లైన్ స్లాట్ బుకింగ్స్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలంటూ గంగాధర మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం నాడు నిరసన కార్యక్రమం నిర్వహించారు. డాక్యుమెంట్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆన్లైన్ విధానం అమలుతో తమ జీవనాధారం దెబ్బతింటుందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యవస్థను పూర్తిగా డిజిటల్ చేయడమే లక్ష్యంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఇది డాక్యుమెంట్ రైటర్లకు నష్టాన్ని తెస్తుందని, వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. సబ్ రిజిస్టర్లో ఆన్లైన్ విధానం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని, సమాచార లోపంతో అనేక రిజిస్ట్రేషన్లు ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ధరణి వ్యవస్థ పేరుతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు ఆన్లైన్‌లోకి వచ్చినా, ఇప్పటికీ సమస్యలు పూర్తిగా పరిష్కరించబడలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సబ్ రిజిస్టార్ లో ఆన్లైన్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయడం అన్యాయమన్నారు. తాము చాలాకాలంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు కోరారు. ప్రభుత్వానికి గట్టిగా హెచ్చరిక ఇస్తూ, తమ జీవనాధారం నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం సబ్ రిజిస్టర్ లో ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ల సంగం అధ్యక్షుడు తోట చంద్రయ్య, జనరల్ సెక్రెటరీ గంట కిషన్, ఆర్గనైజ్ సెక్రటరీ రమేష్, ట్రెజరర్ సూర్య ప్రతాప్, కమలాకర్, ప్రతాప్, అనిల్, అచ్యుత్, శ్రీనివాస్, మహేష్, హరీష్, యోనా, రాజశేఖర్, రఘు, తిరుపతి, గగన్, తదితరులు పాల్గొన్నారు.



# అల్లునూర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా...

**● మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...**





**కరీంనగర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యు న్యూస్):** అల్లునూర్ గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్లునూరు గ్రామంలో రూ. 105 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ ఇప్పటికే అల్లునూరు గ్రామంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఇక ముందు కూడా గ్రామ అవసరాలు తీర్చి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తానన్నారు. నియోజకవర్గ నిధులతోనే కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో ఇక్కడ చేపట్టే పనులతో అల్లునూరు శరవేగంగా అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోగల ఈ గ్రామ సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా వివిధ పనుల నిమిత్తం ఇప్పటికే కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించడం జరగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,కంది లక్ష్మీనారాయణరెడ్డి, తమ్మనవేణి రమేశ్ యాదవ్. కంది అశోక్ రెడ్డి,ఎల్లారెడ్డి, కొమ్ము శ్రీనివాస్,అనోహర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబలి వితరణ కేంద్రం ప్రారంభం..




**కరీంనగర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు తణుకు సాయి ఆధ్వర్యంలో కమాన్ కూడలి వద్ద "అంబలి వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇట్టి అంబలి కేంద్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షులు నగునూరి రాజేందర్ జిల్లా అధ్యక్షులు కన్నా కృష్ణ, 48వ డివిజన్ కార్పొరేటర్ దుర్శెట్టి అనూప్ కుమార్ లు హాజరై అంబలి వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ యువజన సంఘం అధ్యక్షులు తనకు సాయి కృష్ణ మాట్లాడుతూ వేసవికాలం ముగిసే వరకు సుమారు ప్రతిరోజు 500 మందికి ఉదయం 9:00 గంటల నుంచి అంబలి వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎండ తాకిడి వల్ల తలెత్తే సమస్యలో కొంతమేర ఉపశమనం కలిగేలా,ఆరోగ్య రీత్యా అంబలి వల్ల చాలా ఉపయోగాలు ఉన్నందున ఈ వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి పట్టణ మహిళా సంఘం రావికండి భాగ్యలక్ష్మి ,జిల్లా అధ్యక్షురాలు చకిలం స్వప్న,యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కన్న సాయి, కోశాధికారి సూరజ్ అదనపు ప్రధాన కార్యదర్శి గంప వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆకాష్,రాహుల్, రాజేష్, కార్యదర్శి సాయి కృష్ణ, ప్రమోద్,యశ్వంత్,సాయి యువజన సంఘం సభ్యులు, ఆర్యవైశ్య పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిభాపూలే ఆలోచనలతోనే భారతదేశం నిర్మించబడింది..

**● పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్**

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్, పిసిసి కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్ ఇతర ముఖ్య నేతలు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం నగర కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద గల పూలే విగ్రహానికి మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ గారు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్ ఇతర ముఖ్య నేతలు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడి, వారి జీవితాల్లో వెలుగు నింపిన మహాత్మా జ్యోతి భాపూలే ఆలోచనలతో ఈ భారత దేశం నిర్మించబడింది.భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ సైతం మహాత్మ జ్యోతిబాపూలే నా గురువు అని, వారే నాకు ఆదర్శం అని పేర్కొన్నారు అంటే పూలే ఘన చరిత్ర ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.అక్షరాస్యత మహిళలు అణిచివేతకు గురవుతున్న కాలంలో రాత్రి బడులు స్థాపించి మహిళా పాఠశాలలు నెలకొల్పి విద్యా ప్రధానం చేసి మహాత్మునిగా కీర్తించబడినారు, వారి ఆశయాల సాధన కోసం వారు కన్న కలల సామ్రాజ్యాన్ని స్థాపించడం కోసం దేశంలోని ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరుతున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి తాజ్, బానోతు శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, గడ్డం విలాస్ రెడ్డి, చర్ల పద్మ, మల్లికార్జున రాజేందర్, మల్యాల సుజిత్ కుమార్, కల్వల రామ్ చందర్, నిహాల్ అహ్మద్, ఎలగందుల మల్లేశం, మునిగంటి అనిల్,దన్నాసింగ్,బొబ్బిలి విక్టర్, కుర్ర పోచయ్య, అహ్మద్ అలీ, వెన్నం రజిత రెడ్డి, వంగల విద్యాసాగర్, మాదాసు శ్రీనివాస్, కోడూరు రవీందర్ గౌడ్,మంద మహేష్,మారంపల్లి లక్ష్మీనారాయణ,ఇమ్రాన్,కుంభాల రాజకుమార్,నెల్లి నరేష్,పొలాస వాసు,స్వప్న శ్రీ,శిల్ప, నేతరి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.




# మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయం...

**● బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..**




**కరీంనగర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పూలే జయంతి ని పురస్కరించుకొని శుక్రవారం రోజున కరీంనగర్లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా పూలే త్యాగాలను, సమాజానికి సేవలను గంగాడి కృష్ణారెడ్డి గుర్తుచేసుకొని మాట్లాడారు. సామాన్యుడిగా మొదలై, సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అంటరానితనం , కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని, సమ సమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పూలే అని కొనియాడారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనార్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని గంగా డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్,పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు, జిల్లా అధ్యక్షులు దూలం కళ్యాణ్, మాజీ కార్పొరేటర్లు కొండపల్లి సతీష్ చొప్పరి జయశ్రీ,బండ రమణారెడ్డి,శివకుమార్ ఓబీసీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు అడిచెర్ల రాజు,చిట్టిబాబు, మండల అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్, బండారి గాయత్రి, బీజేపీనాయకులు పేరుక శ్రవణ్, సోమిడి వేణు,ఈసపల్లి మహేష్ తిరుపతి వేణు సత్యం , రమేష్ వంశి సతీష్ శ్రీనివాస్ సంపత్ పటేల్ రవి శ్రీకాంత్ అరవింద్, భరత్, అనుదీప్, ప్రసాద్, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం...

**● కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...**




**మానకొండూర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 143 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పేదలకు అండగా ఉంటూ వారి కోసం అనేక పథకాల ద్వారా ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తున్నదన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద ఇస్తున్న ఆర్థిక సహాయాలు వారి అవసరాలను కొంత మేరకు తీర్చగలుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, తాళ్లపల్లి సంపత్ గౌడ్, కోంద్ర సురేష్, కనకం అశోక్,ఇర్ఫాన్,బండి మల్లేషం,రెవెన్ ఇన్ స్పెక్టర్ కె.రాములు, జూనియర్ అసిస్టెంట్లు మహ్మద్ అజహర్, శారద, నాగరాణి, రికార్డు అసిస్టెంట్లు వీరేందర్, బాపుదేవ్ పాల్గొన్నారు.

# 607 లబ్ధిదారులకు రూ.6.07 కోట్ల చెక్కుల పంపిణీ...

**● తులం బంగారానికి మోక్షం ఎప్పుడో చెప్పని కాంగ్రెస్ ప్రభుత్వం**

**● హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘాటు విమర్శలు...**



**హుజూరాబాద్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలోహుజురాబాద్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 607 మంది లబ్ధిదారులకురూ. 6,07,70,412 విలువగల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులనుహుజురాబాద్ ఎమ్మెల్యే శ్రీ పాడి కౌశిక్ రెడ్డి గారు స్వయంగా పంపిణీ చేశారు.వివరాల ప్రకారం:-హుజురాబాద్ మండలం (167) చెక్కులు,జమ్మికుంట మండలం (233) చెక్కులు,వీణవంక మండలం (145) చెక్కులు,ఇల్లందకుంట మండలం (62) చెక్కులు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,"ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పటికీ ఒక్క గ్రామానికైనా ఇచ్చిందా?" అని సూటిగా ప్రశ్నించారు.ప్రజలను మోసం చేస్తూ, అమలు చేయని



హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,తులం బంగారానికి మోక్షం ఎప్పుడో చెప్పాలని డిమాండ్ చేశారు.అలాగే,"తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే ఈరోజు ప్రజలకు ఊరట ఇస్తున్నాయి.కానీ వాటినే నిలిపివేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై విరోధాన్ని చూపుతోంది.కేసీఆర్ మీద కోపం ఉంటే పథకాల పేర్లు మార్చండి కానీ ప్రజలకు మేలు చేసే పథకాల్ని మాత్రం కొనసాగించండి" అని హితవు పలికారు."ఆరోగ్యశ్రీ, కేసీఆర్ కిట్ వంటి జనహిత పథకాలు కూడా నిలిపివేయడం దారుణం" అని ఎద్దేవా చేశారు.ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టి కమిషన్లకు కేంద్రంగా రాష్ట్ర పరిపాలన నడుస్తోందని తీవ్రంగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట పీఎస్‌సిఎస్ చైర్మన్ పోనగంటి సంపత్,వీణవంక పీఎస్‌సిఎస్ చైర్మన్ విజయ్ భాస్కర్,జమ్మికుంట మార్కెట్ చైర్మన్ స్వప్న సదానందం, తదితరులు పాల్గొన్నారు.లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే గారికి ధన్యవాదాలు తెలిపారు.




# గ్రామ గ్రామాన మాదిగలు సంబరాలు చేసుకోవాలి

**- మాట నిలబెట్టుకున్న మాదిగల పెద్దన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు**

**- మాదిగ జె ఎ సి చైర్మన్ పిడమర్తి రవి**

**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**మాదిగల రిజర్వేషన్ గవర్నర్ ఆమోదం తో నేపథ్యాన్ని పురస్కరించుకుని, మాదిగ సామాజిక వర్గం గ్రామ గ్రామాన సంబరాలు జరుపుకోవాలని మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. ఫాతిమా నగర్ లో మదర్ థెరిసా విగ్రహం దగ్గర ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప మనసున్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని మాదిగల పక్షపాతి అని మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం హనుమకొండ ఫాతిమా నగర్చేరుకున్న మాదిగ జె ఎ సి చైర్మన్ పిడమర్తి రవి మాదిగ ను మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ, నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగ సామాజిక కుటుంబాలలో వెలుగు నింపిన మహానుభావుడు సీఎం రేవంత్ రెడ్డి అని, 9% రిజర్వేషన్ అమలు చేయడం గవర్నర్ సంతకం చేయడం అభినందనీయం అన్నారు. అందుకే గ్రామ స్థాయి నుండి పట్టణాలలో కూడా వాడవాడల్లో సంబురాలు జరుపుకోవాలని స్వీట్లు పంపిణీ చేశారు.కాడపాక రాజేందర్, మంద ఆరోగ్యం, వసంత రావు,నక్క మహేష్, మీసాల మహేష్, సుభాష్ శ్రీను,రఘురామ్ అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతాపురం శాంతికి నిదర్శనం

**- సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పై రైతులు చూపుతున్న అభిమానం**

**- వడ్ల రాశులపై వారి పేర్లు నిదర్శనం**

**తోరూరు ప్రతినిధి, ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అంటే రైతులకు ఎనలేని అభిమానం. కొన్ని చీడపురుగులు చేస్తున్నాయి పార్టీని అవమానం?. రైతులు పండించిన వారి ధాన్యం రాశి కుప్పల పైన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి పేర్లను రాసి అభిమానాన్ని చాటుకున్నారు. శాంతిపురం అంటే శాంతికి నిలయంగా పాలకుర్తి మండలంలోని శాతపురం గ్రామానికి చెందిన రైతు గాదరి రామయ్య ఓ వినూత్న రీతిలో సీఎం రేవంత్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యేయశస్విని రెడ్డి వీరికి కృతజ్ఞతలు తెలిపారు. తొర్రూరు సొసైటీ ఆధ్వర్యంలో సాగు చేసిన ధాన్యం రాశిపై రంగులతో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అని పదాలను రాసి పక్కన త్రివర్ణపతాక శైలిలో అలంకరించి ప్రజల్లో ఆకర్షణీయంగా నిలిచారు శాంతాపురం రైతు గాదరి రామయ్య.ఈ చర్యతో రైతు రామయ్య ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీసుకున్న వేగవంతమైన చర్యలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రైతులకు అందుతున్న మద్దతు ధర, విధానాలు తమకు పెద్ద ఆదరణగా నిలుస్తున్నాయని, అలాగే స్థానిక ఎమ్మెల్యే ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ వినూత్న కృతజ్ఞతాభివ్యక్తి ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామస్తులు, ఇతర రైతులు ఈ చర్యను ప్రశంసిస్తూ, ఇదే విధంగా ప్రభుత్వానికి తమ అభినందనలు తెలియజేయాలని భావిస్తున్నారు.ఇది ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందన్న దానికి మరొక నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు.



## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పులివెందుల ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** నేడు 2వ శనివారం పులివెందుల 132 కెవి సబ్ స్టేషన్ లో మెయింటినెన్స్ పనులు వున్నందున ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్లపురెడ్డిపల్లి ,ఈకొత్తపల్లి ,సరస్వతి మైన్స్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మరియు వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును అని పులివెందల రూరల్ విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు . విద్యుత్ సరఫరా లో అంతరాయాన్ని ప్రజలు మరియు రైతులందరూ సహకరించవలసినదిగా కోరారు.

## మొక్కలను పంపిణీ చేసిన తహసిల్దార్



**యాడికి ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** యాడికి తహసిల్దార్ ప్రతాపరెడ్డి మండల రైతులకు మామిడి, అల్ల నేరేడు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మొక్కలను రైతులు సంరక్షించుకోవాలన్నారు. ప్రతి రైతు తమ పొలాల్లో ఒక మొక్కను పెంచుకుంటే కాలుష్య నివారణ తగ్గి వర్షాలు కురుస్తాయన్నారు. వచ్చే వర్షాకాలంలో ప్రతి రైతుకు ఒక మొక్కను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో దామోదర్ నాయుడు, భీమేశ్వర్ రెడ్డి, రైతులు హరి, రఘు, ఐ టి డి పి అధ్యక్షుడు నరసింహ చౌదరి, సెల్ పాయింట్ చాంద్ బాషా, నీలకంఠ రెడ్డి, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఏపీవోను సన్మానించిన టిడిపి నాయకులు



**యాడికి ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** యాడికి నూతన ఏపీఓ మద్దిలేటిని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ .. జాబ్ కార్డు ఉన్న ఉపాధి కూలీలందరికీ పని దినాలు కల్పించాలని కోరారు. పనిచేసే చోటు కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, నరసింహ చౌదరి, నీలకంఠ రెడ్డి, సెల్ పాయింట్ చాంద్ భాష, చందు, ఫిరోజ్, వెంకటేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## దేవర మహోత్సవంలో పాల్గొన్న వైసిపి జిల్లా నాయకురాలు శశికళ



**ఆస్పరి, 11(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆస్పరి మండలం వలగొం డ్ల గ్రామంలో కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా నాయ కురాలు శశికళ కృష్ణ మోహన్ పాల్గొన్నారు. శుక్రవారం ఆస్పరి మండలం వలగొండ్ల గ్రామంలో వెలసిన కాళికా దేవి ఊరు దేవర మహోత్సవంలో ఆమె ముఖ్య అతిథులుగా హజురై కాళికా దేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంత ముందు గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పూజానంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వదించారు.

## వరంగల్ నిట్ విద్యార్థి ఆత్మహత్య



**వరంగల్ ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ నిట్‌లో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న హైదరాబాద్ – కొత్తపేటకు చెందిన హృతిక్ సాయి (22) బుధవారం నుండి కనపడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన తోటి విద్యార్థులుగురువారం సాయంత్రం కాలేజీ సమీపంలోని వడ్డేపల్లి చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు గుర్తించిన పోలీసులుఆ మృతదేహం హృతిక్ సాయిదే అని గుర్తించిన తోటి విద్యార్థులు మార్కులు తక్కువగా రావడంతో హృతిక్ సాయి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం

## సిరిసిల్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి, స్థానిక ఎమ్మెల్యే మంత్రులు హాజరు



**సిరిసిల్ల,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ, సత్య దూరమైన వార్తలను పరిశోధించి ప్రజలకు అందించాలని పరిశ్రమల మరియు ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు.సిరిసిల్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సిరిసిల్ల పట్టణం లోని లహరి గ్రాండ్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుల జయంత్, ఆడెపు మహేందర్ లతో పాటు కార్యవర్గ సభ్యులచేత మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేపించారు. అనంతరం నూతన పాలకవర్గానికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు మాట్లాడుతూ సిరిసిల్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దేశంలో ప్రెస్ ఫోర్త్ ఎస్టేట్ గా పని చేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టంగా పనిచేసేలా చూస్తుందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచి సత్య దూరమైన వార్తలను పరిశోధించి ప్రజలకు అందించాలని వారు సూచించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని వారన్నారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం తరఫున సహకరిస్తామని, మండపల్లి లో జర్నలిస్టుకు వచ్చిన స్థలాల్లో మౌలిక వసతులు కల్పించేలా నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వేల్పుల స్వరూప పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే నేటి తరానికి స్ఫూర్తి దాయకం

- సిపిఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్



**బయ్యారం, ఏప్రిల్ 11 (పిసీడబ్ల్యూ న్యూస్):** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సిపిఐ బయ్యారం మండల సమితి ఆధ్వర్యంలో స్తానికి మండల కేంద్రంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా సారిక శ్రీనివాస్ మాట్లాడుతూ నిమ్న కులాల వారి కోసం స్త్రీల కోసం దేశంలోనే ప్రథమంగా పాఠశాలలు స్థాపించి విద్య వ్యాప్తి ద్వారా వారిని దాస్య విముక్తిని చేసేందుకు కుల వివక్షతను సాంఘిక దోపిడిని మూఢనమ్మకాలను వాటికి కేంద్ర బిందువైన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని బద్దలు కొట్టేందుకు తిరుగుబాటు బావుటాను ఎగరవేసిన తొలి తరం సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ఆధిపత్యం కొరకే అన్నట్టు నడిచిన కష్టమైన ఆనాటి కాలంలోనే సమానమైన మరో సమాజం కోసం నడుం బిగించాడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు నేడు జరుగుతున్న కుల వివక్ష రూపాలపై పూలే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.మతోన్మాదిమానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని అన్నారు.విద్యాకాశాయికరనకు జ్యోతిరావు పూలే స్పూర్తిగా తీసుకొని ఉద్యమించాలని అన్నారు.విద్యాసంస్థలల్లో జ్యోతిరావు పూలే దంపతులు విగ్రహాలను ఏర్పాటు చేయాలని వారి స్ఫూర్తిని నేటి తరం భావిభారత విద్యార్థిని విద్యార్థులకు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాదెండ్ల పద్మ,కాంతి,వీరన్న పాల్గొన్నారు.

## జ్ఞాన సంపాదనను అందరికీ సమానంగా పంచిన మహనీయుడు పూలే...

- సిపిఎం అధ్వర్యంలో ఘనంగా జ్యోతి రావు పూలే జయంతి



**గార్ల, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** జ్ఞాన సంపాదనను అందరికీ సమానంగా పంచడంలో తన జీవితాన్ని అ అంకితం చేసిన మహనీయుడు జ్యోతి రావు పూలే అని సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి ని శుక్రవారం సిపిఎం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్దానిక అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు పూల మాలలు వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలకు విద్య అందించడానికి కృషి చేసిన భారత ప్రథమ సామాజిక తత్వవేత్త,ఉద్యమకారుడు,సంఘ సేవకుడు పూలే అన్నారు.కులం గురించి న సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపోదించిన తొలి దార్శనికుడు పూలే అని,దుర్మార్గమైన కుల వ్యవస్థను సమూలంగా నిర్మూలన కావాలని,ఆయన అలోచన లకు,విశ్లేషణకి 'గులాం గిరి' అద్దం పడుతుందని చెప్పారు.సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలు,మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన పూలే ఆశయసాధనకొరకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు కందునూరి ఈశ్వర్ లింగం, మండల నాయకులు,కార్యకర్తలు వి.పి వెంకటేశ్వర్లు,కె.రామకృష్ణ, ఎస్.నాగరాజు,టి. నాగేశ్వరరావు, కోటయ్య, సాయి,బి.రాజేష్, వెంకటేశ్వర్లు,రమేష్ తదితరులు ఉన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**ములుగు జిల్లా, ఏప్రిల్ (పిసిడబ్ల్యూ న్యూస్):** గోవిందరావుపేట మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయం నందు సామాజిక ఉద్యమ నేత ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ఎల్.పి రాము అధ్యక్షతన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌరవనీయులు సూపర్డెంట్ మేడం దుర్గ లక్ష్మి చేతుల మీదుగా ఈ మహానీయుని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది అదేవిధంగా ఏపీవో ప్రసన్న అదేవిధంగా ఎంపీఓ శరత్ బాబు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ యిగ్బాల్ అదేవిధంగా పెద్దబోయిన శ్రీనివాస్ తో పాటు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు ఉపాధి హామీ కూలీలు మరియు తదితరులు పాల్గొనడం జరిగింది



## ఘనంగామహాత్మా జ్యోతి రావు పూలే వేడుకలు

- AYS రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య.




**చిట్యాల, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ అద్యక్షతన మహాత్మా జ్యోతి రావు పూలే 198 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఆ మహానీయుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా AYS రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లయ్య,CPI ML లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ లు మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలే 11 ఏప్రిల్ 1827 న జన్మించాడని, మరియు షనవంబర్ 28, 1890 న మరణించారని తెలిపారు . ఆయన బ్రతికినంత కాలం సామాజిక సమానత్వం కోసం పోరాడారని, బాల్యంలో అనుభవించిన దుర్భర జీవితం 19 వ శతాబ్దపు చీకటి రోజుల్లో బ్రాహ్మణీయ కులతత్వపు కోరల్లో చిక్కి శల్యమై పోతున్నా అణగారిన వర్గాలలో కుల నిర్మూలన దృక్పథాన్ని బోధించి అగ్రకులాల దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా అట్టడుగు వర్గాల ప్రజలను సామాజిక విప్లవం దిశగా మేల్కొలిపిన తొలి సామాజిక విప్లవ చైతన్య స్ఫూర్తి మహాత్మా జ్యోతి రావు పూలే అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నవాబ్ పేట మాజీ సర్పంచ్ రత్నాకర్ రెడ్డి అంబేద్కర్ వాది అంబాల అనిల్ అంబేద్కర్ యువజన సంఘం మండల కోశాధికారి కనకం తిరుపతి ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు నాయకులు పాముకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆన్ వీల్స్' అమలుపై సన్నాహక సమావేశం...



**మానకొండూర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెలలో అతి త్వరలో ప్రారంభించనున్నఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం అమలుపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆరు మండలాలకు ఎంపీడీవోలు, తహసీల్ధార్లతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల చెంతకే వెళ్లి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్న ఉద్దేశంతో చేపట్టిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు తోడ్పాటునందించాలని కోరారు. గ్రామ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయానికి ప్రత్యేకమైన యాప్ ను రూపొందిచామని, ఈ యాప్ ద్వారా ప్రజల నుంచి వచ్చే విన్నపాలను పరిష్కరించేందుకు రోజుకు మూడు గ్రామాలకు ప్రత్యకంగా తయారు చేయించిన వాహనంలో అధికారులతో కలిసి వెళ్లడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు యాప్ ద్వారా తెలియజేసిన సమస్యల గురించి తెలుసుకొని అప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. మంచి ఉద్దేశంతో చేపట్టే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని, సమస్యల పరిష్కరించేందుకు పాటుపడాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజినీర్లు రవి ప్రకాశ్, మంజులా భార్గవి,తహశీల్దార్లు కె.వరలక్ష్మి, బత్తుల భాస్కర్, విజయ్ కుమార్, ఎంపీడీవోలు విజయ్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, వై.శశికళ, డిప్యూటీ తహసీల్దార్లు సమ్మయ్య, నర్సింహచారి,గోపాల్, సత్యనారాయణ,ఏఈలు సురేందర్ రెడ్డి, స్నేహాజ్యోతి, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ రెడ్డి,వెంకటేశ్, సంతోష్ తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

- భావి తరాలకు సైతం మార్గదర్శకులు
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**హనుమకొండ, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** అణగారిన వర్గాల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషిచేసిన సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బిజెపి ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు కోమాకుల నాగరాజు, మండల బిజెపి అధ్యక్షులు విప్ప సుధాకర్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ, దేశాయిపేట లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి ఆ మహనీయునికి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేసిన మహాత్మ జ్యోతిరావు పూలే అని, అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే. సమ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకం. పూలే ఆశయ సాధనకు పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళులర్పించి, పేద ప్రజలకు పండ్ల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, మాచర్ల దీన్ దయాల్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగికర్ అనిల్, అధికార ప్రతినిధి సాగర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోవింద్ సింగ్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు సతీష్, శ్రీనాథ్, బిజెపి నాయకులు కోట సతీష్, ప్రభాకర్ గుప్తా, ప్రభాకర్, కందుకూరి శ్రీనివాస్, మల్లికార్జున్, ప్రభాకర్, రాఘవాచారి మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్ఫూర్తి గ్రూప్, సిఐటియుల ఆధ్వర్యంలో సామాజిక విప్లవ కారుడు ఆత్మ జ్యోతిబాపూలే జయంతి

**కాప్రా, ఏప్రిల్ 11 (పీసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, సిఐటియు ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమ మహనీయుల చైతన్య ఉత్సవాలలో భాగంగా 11/ 4/ 2025 ఉదయం 11 గంటలకు సైనిక్పురి చౌరస్తాలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర నివాళి మరియు సభా కార్యక్రమం జరిగింది. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా జరిగే కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె చంద్రశేఖర్, శ్రీనివాసరావు, మంగ, హెచ్ వి స్వామి, నరసింహారావు స్ఫూర్తి గ్రూపు నాయకులు గొడుగు యాదగిరిరావు, జయరాజ్, వెంకట్, జి శివరామకృష్ణ, రహీం, వెంకటసుబ్బయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి జే చంద్రశేఖర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల కొరకు ఎంతో కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా ఆనాడు శూద్రులకు చదువు నిరాకరించ బడటంతో, తాను ముందుగా చదువుకొని తన భార్యకు చదువు నేర్పి వెనకబడిన తరగతులకు ముఖ్యంగా అంటరాని కులాల వారికి అందులో



బాలికలకు చదువులు చెప్పటం ఫలితంగా ఎంతో మంది అభివృద్ధికి దోహద పడ్డారని చెప్పారు. ఆయనను ఆనాడు వ్యతిరేకించి కించిపరిచిన వాళ్ళు నేడు పరిపాలన చేస్తున్నారని, దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని చెప్పారు. సామాజిక ఉద్యమ నేత జయరాజు మాట్లాడుతూ బ్రాహ్మణీయ భావజాలంతో ఆనాడు జ్యోతిరావు పూలే ను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారని దానికి వ్యతిరేకంగా నిలబడి పోరాడారని చెప్పారు. వారికి నిజమైన నివాళి అంటే ఈనాడు ఉన్న మనువాద సంస్కృతిని దాన్ని పెంచి పోషించే వాళ్ళకి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలని చెప్పారు. అధ్యక్షులు గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జీవితంపై తీసిన పూలే సినిమాను ఈ నాడున్న బ్రాహ్మణీయ భావజాలం కలిగిన పాలకులు అడ్డుకున్నారని అటువంటి వారే నేడు ఆయనకు దండలు వేసి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నినాదాలు చేస్తున్నారు. ముందు అటువంటివారు తమ భావాలలో ఉన్న మనువాద సంస్కృతిని తొలగించుకోవాలని చెప్పారు. సేవా కార్యక్రమాల్లోనూ, మూఢనమ్మకాలకు వ్యతి రేకంగానూ సకల వివక్షల కు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధు డని చెప్పారు. అన ఆశలను ముందుకు తీసుకెళ్లడ మే మన అందరి కర్తవ్యమని చెప్పారు.చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ ఆనాడు జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలేలు చేసిన కృషి ఫలితంగా బాలికలకు చదువు సాధ్యమైందని అన్నారు. నేడు మాలాంటి మహిళలు చదువుకొని వివిధ రంగాల్లో ముందు కెళ్లటానికి వారు చేసిన కృషి ఫలిత మే అని అన్నారు. ఈ కార్యక్రమంలో వంశరాజ్ మల్లేష్, నరసింహారావు, హెచ్ వి స్వామి, మంగ, రహీం, యాదగిరిరావు, జె చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, జయరాజ్, శివరామకృష్ణ, ఎం శ్రీనివాసరావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్ర

- కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ పాలనలో ప్రశ్నార్థకంగా మారిన రాజ్యాంగ పరిరక్షణ

**గంగాధర, ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గడపగడపకు జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రను నిర్వహిస్తాం.సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీటఎమ్మెల్యే మేడిపల్లి సత్యంగంగాధర లో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో రాజ్యాంగ పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పాదయాత్రకు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. వందలాదిగా జై బాబు జై భీమ్ జై సంవిధాన్ యాత్రలో పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రశ్నార్థకంగా మారిన రాజ్యాంగ పరిరక్షణ కోసం అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.



ఏఐసీసీ పిలుపుమేరకు చొప్పదండి నియోజకవర్గం లోని గడపగడపకు పాదయాత్రను నిర్వహిస్తామన్నారు. గత పది ఏళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని. మహాలక్ష్మి పథకం పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, జ్యోతి పథకంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్ ఇస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో నిర్వహిస్తున్న జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ



చైర్మన్ రజిత శ్రీనివాస్,వెలిచాల తిర్మల్ రావు, రాజగోపాల్ రెడ్డి,మండలాధ్యక్షుడు పురమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, పడ్నాల రాజన్న,తాళ్ళ శ్రీనివాస్,రామిడి రాజిరెడ్డి,బుర్గు గంగన్న, దోర్నాల శ్రీనివాసరెడ్డి, వేముల భాస్కర్, వెముల అంజి,ఎస్సి సెల్ అధ్యక్షులు కొలెపాక స్వామి,ఓడ్నాల యగ్నేష్ ,రోమల రమేష్,కర్ర విద్యాసాగర్ రెడ్డి,సత్తు కనుకయ్య,రెండ్ల శ్రీనివాస్ , మంత్రి మహేందర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దూలం వీరేశం, దీకొండ మధు, గరిగంటి కరుణాకర్,చందు, సతీష్ ,ముచ్చె శంకర్, గంగాధర సుదర్శన్, నాగేందర్ రెడ్డి, పెద్దోళ్ల రాజేశం, రామంచ రాజు, ప్రభాకర్, ఆనంద్, కరీం, దోమకొండ మహేష్, పిట్టల మల్లేశం,నగేష్, ప్రభాకర్, శ్రీనివాస్, కోలాపురం లక్ష్మణ్, కుమారస్వామ,కముటం శ్రీనివాస్, రొండ్ల అనిల్ పాల్గొన్నారు.

# చదువు అంటే నాకు ఎంతో ఇష్టం

- నా చదువుకు భంగం కలిగియ్యకండి
- పాఠశాలలో ఏకాంతంగా కూర్చుని రాసుకుంటున్న విద్యార్థిని
- పాఠశాలకు వంట పాత్రలు ఇచ్చినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్న గ్రామస్తులు




**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** మట్టిలో మాణిక్యాలు ఉంటాయంటారు. ఆ మట్టిలోని మాణిక్యమే ఈ విద్యార్థిని ఒకరు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్న గదిలో అల్లరి భరించలేక బయట నేను కూర్చుని రాసుకుంటున్న. మారుమూల గిరిజన ప్రాంతం అది. తొర్రూరు మండలంలోని కొమ్మనపెల్లి తండా గ్రామపంచాయతీపాఠశాలలో 11 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు దామోదర్, మరో ఉపాధ్యాయురాలు అనిత ఉన్నారు. ఈ పాఠశాలలో పిల్లలకు గతంలో వంట చేసేందుకు సరైన గిన్నెలు లేక అవస్థలుఎదుర్కొన్నామని నూతనంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో వంట పాత్రలు పంపిణీ చేశారని ప్రధానోపాధ్యాయులు తెలుపగా ఇంత మంచి కార్యక్రమాన్ని అమలు చేసిన ఎమ్మెల్యేకు కొమ్మనవెల్లి తండా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.







# రాజస్థాన్ వ్యాపారులకు వ్యతిరేకంగా కరీంనగర్ అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో నిరసన...

**కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ అన్నపూర్ణ కాంప్లెక్స్ లో రాజస్థాన్ వ్యాపారులకు వ్యతిరేకంగా మొబైల్ షాపుల నిర్వాహకులు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టారు. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన హెూల్సెల్ మొబైల్ సెంటర్ వ్యాపారులు, 300 మంది రిటైల్ మొబైల్, టెక్నీషియన్స్ కుటుంబాల పొట్ట కొట్టే విధంగా రిటైల్ వ్యాపారం చేస్తున్నారన్నారు. షాపులు బందు చేసి నిరసన తెలిపారు. నకిలీ వస్తువులు తీసుకువచ్చి జీరో మాల్ తక్కువ ధరలకు అమ్ముతున్నారనీ,అధికారులుచూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని మొబైల్ సెంటర్ వ్యాపారస్తులు అంటున్నారు.



# సొంత గూటికి చేరిన మహిళా కాంగ్రెస్ నేత



**గోదావరిఖని,ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** పట్టణ మాజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమ్మెట స్వప్న గత శాసనసభ ఎన్నికల సమయంలో బి ఆర్ ఎస్ రాజకీయ పార్టీలోకి వెళ్ళింది కాలచక్రం తిరిగి ఆమెను తన మాతృపార్టీ కాంగ్రెస్ గూటికి తీసుకువచ్చింది. రామగుండం శాసనసభ్యుడు ఎం. ఏస్. రాజ్ ఠాకూర్ నేతృత్వంలో, నేతల సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీనే నా అసలైన కుటుంబం. పార్టీలోకి తిరిగి రావడం ఆనందంగా ఉంది. రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి నా వంతు కృషి చేస్తాను అని చెప్పారు.

# పూలే ఆశయ సాధనకై పునరంకితమవుదాం..

**- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, మాజీ సర్పంచ్ నర్సింగ్ యాదవ్**



**పెద్దపల్లి:ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ ని ఏర్పాటు చేసి జీవితాంతం అణగారిన వర్గాలకు అధికార ఫలాలు దక్కాలని పోరాడారని,ఆయన ఆశయ సాధన కోసం రాజకీయాల కతీతంగా పాటుపడాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింగ్ యాదవ్ అన్నారు.జూలపల్లి మండలం బాలరాజుపల్లి గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్, నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ సంస్థాపక వేడుకల నిర్వహణలో భాగంగా మహనీయుల జయంతి కార్యక్రమాలు చేపట్టామని దాంట్లో భాగంగా పూలే జయంతి వేడుకల్లో బీజేపీ పక్షాన పాల్గొంటున్నామన్నారు. అంటరానితనం,కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే గొప్ప కృషి చేశారని, నిమ్న వర్గాలకు విద్యను అందించడం ద్వారా అస్పృశ్యతను నివారించవచ్చని, అందరికీ విద్యను పెద్ద ఎత్తున ప్రోత్సాహించరని చెప్పారు. బడుగు బలహీన వర్గాలు ఏకతాటిపైకి వచ్చిన నాడే జ్యోతిబాపూలే కు నిజమైన నివాళి అని ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించిన దానికి సార్ధకత చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మ పోచాలు యాదవ్, మొగుడం రమేష్, అద్వల తిరుపతి, వెంకటేష్, పెద్దోళ్ల ఐలయ్య,కోకన్వీనర్లు కొల్లూరి స్వామి,తీగల అశోక్, కోరుకంటి హరికిషన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు

# ఆర్ కృష్ణయ్యకు ఆత్మీయ సన్మానం..

**కరీంనగర్:ఏప్రిల్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఎంపీ ఆర్ కృష్ణయ్య కు రామగుండం ఎన్ టి పి సి పరిధిలో మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణకు విచ్చేసి ఆవిష్కరణ అనంతరం తిరుగు హైద్రాబాద్ ప్రయాణంలో కరీంనగర్లో బీసీ సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మనోజ్ గౌడ్ నివాసానికి రావడం జరిగింది. బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ ని కలిసి శాలువాతో సత్కరించి పూలే బొకే అందించారు. ఆర్ కృష్ణయ్య జిల్లాలో బీసీ సంఘం బలోపేతానికి తీసుకోవలసినటువంటి చర్యల పైన చర్చించడం జరిగింది. వారితోపాటు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మనోజ్ గౌడ్ విద్యార్థి సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు సంజీవ్ తదితరులు ఉన్నారు.

